


(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

**డిసెంబరు-2004**

"అబ్బ, ఎన్నాళ్ళయింది! మనమందరం ఇలా కలుసుకొని!" సూసీని కౌగలించుకొని అంది భాను. ఎన్నో యేళ్ళ తరవాత సూసీ క్రిస్మస్ పార్టీ ఏర్పాటు చేసి అందరినీ పిలిచింది.

"రావే భానూ! ఎన్నేళ్ళయింది నిన్నూ అశోక్‌నీ చూసి! ఇద్దరు పిల్లలా? హౌ స్వీట్! పేర్లేంటి?" పాపని భాను చేతుల్లోంచి లాక్కొని ముద్దు పెట్టుకుంటూ అడిగింది సూసీ.

"మెరీ క్రిస్మస్ సూసీ! అయినా క్రిస్మస్ నిన్ననే అయిపోయిందనుకో!" తను తెచ్చిన కేకు టేబిల్ మీద పెట్టి సూసీని హత్తుకుంది భాను.

"నిన్న క్రిస్మస్‌రోజు అందరం అమ్మా వాళ్ళతో చర్చి కెళ్ళాము. అందుకే పార్టీ ఇవాళ పెట్టాము. మళ్ళీ మూడు వారాల్లో ఆస్ట్రేలియా వెళ్ళిపోవాలి. అదిగో, ఆశా, శరత్ కూడా వొచ్చారు చూడు!" సూసీ టేబుల్ సర్దుతూ అన్నది.

"ఒక్కొక్కళ్ళం బలే లావవుతున్నామే ఆశా!" భాను దిగాలుగా అంది ఆశ వైపు చూస్తూ! అందరూ నవ్వేసారు.

"కోమలి వచ్చిందా?" భానూని అడిగింది ఆశా.

"ఏమో, తెలియదే. అసలు 2001 సెప్టెంబరు పదకొండు తరవాత కోమలితో మాట్లాడనేలేదు ఆశా! ఎంత తీరికలేని బ్రతుకైపోయిందో! ఈ ఇద్దరు పిల్లలని సవరించుకోని ఆఫీసుకెళ్ళి వొచ్చి, వొండుకొని ఇంత తినేసరికే రోజంతా గడిచిపోతుంది. ప్రతీ యేడూ జనవరిలో అనుకుంటాము, నేనూ అశోక్! ఈ యేడు ఇంకెక్కువ పుస్తకాలు చదవాలనీ, కొంచెం దేశం చుట్టి రావాలనీ, స్నేహితులని రెగ్యులర్‌గా పలకరించాలనీ, ఏవేవో నిర్ణయాలు. ఒక్కటి కూడా నడవవు. మళ్ళీ ఉద్యోగమూ, వంటా, ఇంటి పనీ, పిల్లల పనులు, ఇంతే!"

ఎప్పుడూ లేనిది భాను మాటల్లో కొంచెం డల్‌నెస్ చూసి ఆశ్చర్యపోయింది ఆశా.

"నువ్వే కాదు, అందరమూ అదే పరిస్థితిలో వున్నాం భానూ. పెద్దవాళ్ళమవుతున్నాం కదా, భాధ్యతలు కొత్తగా వొచ్చి మీద పడుతూంటే మరి సర్దుకుంటూ నడుస్తున్నాం కదా? ఒక పని చేద్దాం. వచ్చే యేడు, నువ్వూ నేనూ, ప్రతీ మూడు నెలలకోసారి తప్పకుండా కలుద్దాం. ఒక్కొక్కసారి ఒక్కోరింట్లో? ఐడియ బాగుందా?"

"బాగుంది ఆశా. అంతే కాదు, మనిద్దరం కలిసి సూసీకీ, కోమలికీ ఫోన్ చేసి మాట్లడడానికి ట్రై చేయొచ్చు." ఉత్సాహంగా అంది భాను.

"నీ పిల్లలు బలే ముద్దుగా వున్నారే భానూ!" సూసీ వొచ్చి భార్గవ్‌ని ఒళ్ళో కూర్చోపెట్టుకుంది.

"ఆశా, ఈ మధ్య సినిమాలేం చూసావు?" అశోక్ అడిగాడు.

"సినిమాలా? అమ్మో! సినిమాలు చూసేరోజులా? సినిమాలు చూసే టైము మనకీ లేదు, అసలవి చూసేలాగానూ లేవు," చిరాగ్గా అంది ఆశ.

"నీలాటి వీరాభిమానిక్కూడా విరక్తి పుట్టించగలిగాయంటే, ఇట్ ఈజ్ సేయింగ్ సంథింగ్!" సూసీ మాటలకి అందరూ గొల్లుమన్నారు.

"కాదు నిజంగా చెప్తున్నాను. చిన్నతనంలో ఎలా చూసామో, ఏమో! ఇప్పుడు చూస్తే, ఇంత చెత్త చూసామా అని సిగ్గేస్తుంది. అసలు, ప్రేమన్నా, ప్రేమినంచుకున్న వాళ్ళన్న సినిమాల్లో ఎంత చీప్‌గా చూపిస్తారు! చిన్నప్పుడు ఏదీ అర్థంకాలేదు కానీ, ఈ మధ్య తెలుగు సినిమాల్లో ప్రేమ చూసినా, పాటలు విన్నా చాలా కంపరంగా వుంటోంది!"

"అవును! టీనేజీ పిల్లలు ప్రేమించుకోవడమే దరిద్రం అనుకుంటే, వాళ్ళు ప్రేమలో పడ్డప్పటినించీ, బెడ్‌రూంలోకెళ్ళడం గురించి తహతహలాడడం. ఎంత అసహ్యంగా వుంది వినటానికి! నిజానికి ఆ వయసులో ప్రేమించడం సహజమేమో కానీ, ఫిజికల్ ఇంటిమసీ కోసం తహతహలాడే వయసు కాదు కదా? పరీక్షలూ, కెరియరూ ఏ ధ్యాసా లేకుండా, ఇరిటేటింగ్!" శరత్ కూడా ఏకీభవించాడు.

"అదంతా ఆ రచయితా, దర్శకుల విచిత్రమైన, పెర్వెర్టెడ్ ఫాంటసీ! నిజ జీవితంలో అమ్మాయిలూ అబ్బాయిలూ బాధ్యతగానే వుంటారు. నేనూ సూసీ, భానూ–అశోక్ ప్రేమించేకదా పెళ్ళి చేసుకున్నాం. ప్రేమ గొడవలో పడి చదువునీ, కెరియర్‌నీ ఏమీ నిర్లక్ష్యం చేయలేదు. అందుకని, ఆశా, సినిమాలని సీరియస్‌గా తీసుకోకు! వాళ్ళ మొహంలే, అనుకొని తేలిగ్గా తీసుకో! లైట్ లేలో రే!" శివా అన్నాడు అందరికీ కేకు ముక్కలు అందిస్తూ.

అందరూ నవ్వుతూ వుండగా, భాను అందరినీ నిశ్శబ్దంగా వుండామన్నట్టు సైగ చేసి టీవీ వాల్యూము పెంచింది. వార్తలొస్తున్నాయి.

"చెన్నై సముద్ర తీరంలో భయంకరమైన అలలు! సముద్రంలో సునామీ! "

"ఈ రోజు ఉదయం చెన్నై తీరంలో హిందూ మహా సముద్రంలో పెద్ద పెద్ద అలలు తీరప్రాంతాన్ని ముంచేసాయి. దక్షిణ తీర ప్రాంత వాసులంతా భయభ్రాంతులయ్యారు. మత్స్యకారుల్లో, తీర వాసుల్లో ప్రాణనష్టం సంభవించింది." న్యూస్ రీడర్ చెప్పుకుపోతూ వుంది.

"అశోక్! నాన్న! నాన్న చెన్నైలో వున్నారు. ఆఫీసు పనిమీద సోమవారం వెళ్ళారు. అసలు నిన్ననే తిరిగి రావాల్సింది. ట్రెయిన్ టికెట్ రిజర్వేషన్ దొరకలేదని ఆగిపోయారు. అశోక్, నీ మొబైల్ ఫోన్ తీసి నాన్నకి ఫోన్ చేస్తావా?" భానూ ఆందోళనగా అన్నది. అశోక్ జేబులోంచి మొబైల్ ఫోన్ తీసాడు.

"భానూ, మీ నాన్న మొబైల్ ఫోన్ నెంబరు గుర్తుందా?"

"ఆగు, డైరీ తీసి చూస్తాను."

పక్క గదిలోకి వెళ్ళాడు అశోక్. అయిదు నిమిషాల్లో తిరిగొచ్చాడు

"భానూ! మావయ్య గారు సేఫ్! అదృష్టవశాత్తూ ఆయన ఇవాళ బీచి వైపే వెళ్ళలేదట. కానీ చాలా భయపడ్డారు. మీ బంధువులు ఎవరో అణ్ణా నగర్‌లో వున్నారట కదా, అక్కడికెళ్ళారట. రేపు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌కి వచ్చేస్తారు. ఇదిగో, మీ ఇంటికి ఫోన్ చేసి మీ అమ్మతో మాట్లాడు. ఆవిడా భయపడుతూ వుంటారు." పాపను అతని చేతికిచ్చి ఫోన్ అందుకుంది భాను.

"మొబైల్ ఫోన్ ఎప్పుడు కొన్నావ్ అశోక్!" శివా కుతూహలంగా అడిగాడు.

"నాది కాదు, నిజానికి! భానుది. భాను తన కంపెనీలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్‌లో పని చేసేది కదా? పాప పుట్టినప్పుడు మెటర్నిటీ లీవులో కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సులు చేసి వాళ్ళ కంపెనీలోనే ఐటీ వైపు మారిపోయింది. అప్పుడు వాళ్ళ ఆఫీసువాళ్ళిచ్చిన ఫోన్! అదే ఇద్దరమూ వాడుతున్నాం. సౌకర్యంగా వుంది, కానీ భానుకి చార్జింగ్ పెట్టాలన్నా, బాగులో ఫోన్ పెట్టుకోవాలన్నా బద్ధకం. అందుకే, నా జేబులో పెట్టుకొని నా ఫోన్‌లాగా పోజు కొడుతున్నానన్నమాట!"

కొంతవరకు అందరూ నెమ్మదించినా, పార్టీ మూడ్ చెడిపోయింది. మొబైల్ ఫోన్‌ల గురించీ, సాఫ్ట్‌వేర్ చదువుల గురించీ ఏదో మాట్లాడుకొని అందరూ విడిపోయారు.

★★★★★★★★★★★★★★★★★

**2005 – జూన్**

"ఈ యెండాకాలం సెలవుల్లో నీ పిల్లలిద్దరూ నాకు పిచ్చెక్కించారు భానమ్మా!" అశోక్, అలిసిపోయి విసుగ్గా అన్నాడు. నవ్వింది భాను.

"అవును అశోక్! అందులో సెలవులంతా నువ్వొక్కడివే మేనేజ్ చేసుకున్నావు. లక్కీగా మి ఇన్స్టిట్యూట్‌కీ సెలవులిచ్చారు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఏం చేసేవాళ్ళమో! అరేయ్ భార్గవ్, చెల్లి నెత్తిన ఇసుకెవడ్రా పోసింది?" చంటి దాన్ని స్నానానికి తీసికెళ్తూ అంది భాను.

"చెల్లి నా అన్నంలో ఇంకు పోసింది, అందుకే నేను దాని నెత్తిన ఇసుక పోసాను!"

"ఆరేళ్ళొచ్చి దాంతో దెబ్బలాటలా? సిగ్గులేదురా నీకు! బళ్ళు తెరిస్తే కానీ ఈ తల నొప్పి తగ్గదు!"

పిల్లలకి స్నానాలు చేయించి, అన్నాలు తినిపిచ్చేసరికి ఇద్దరికీ అలసట ముంచుకొచ్చింది. తనకీ, అశోక్‌కీ రెండు కంచాల్లో కొంచెం అన్నంలో పప్పు వేసి పట్టుకొచ్చింది భాను.

"అందరూ రాత్రి పూట అన్నం మానేసి చపాతీలు తినమంటారు, కానీ, నాకసలు ఓపిక వుండటంలేదు అశోక్! ఇక బరువెలా తగ్గుతాం?"

"బరువు గురించి అంత బెంగపడకు భానూ! ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత ఆ మాత్రం బరువు ఎవరైనా పెరుగుతారు. ఇద్దరం ముప్పై అయిదేళ్ళకొచ్చాం, చిన్నప్పట్లా ఎలా వుంటం చెప్పు? బీ ప్రాక్టికల్!"

"అది కాదు అశోక్. ఎప్పటికైనా మళ్ళీ బాడ్మింటన్ కొంచెమైనా ఆడాలని ఆశ. పిల్లలిద్దరూ హైస్కూలు కొచ్చిన తరవాత కుదురుతుందేమో. ఈ లోగా ఒళ్ళు బరువు పెరగకుండా, మోకాళ్ళ నొప్పులు రాకుండా చూసుకోగలగాలి. అందుకే నా తాపత్రయం."

"అయితే, నీకోసం నేను రేపణ్ణుంచి సాయంత్రం రెండు పుల్కాలు చేసి పెట్టనా?"

"నువ్వు చేస్తావు సరే, తెల్లటి, తియ్యటి, కమ్మటి అన్నం తినకుండా నేనుండొద్దూ!"

నవ్వాడు అశోక్.

"భానూ, నీకొక సంగతి చెప్పడమే మరిచిపోయాను. అమ్మూ ఫోన్ చేసింది మధ్యాహం."

తలెత్తి చూసింది భాను.

"ఎలా వున్నారు వాళ్ళిద్దరూ! సంక్రాంతి పండగ తరవాత వాళ్ళని చూడనే లేదు."

"అమ్మూకి హైదరాబాదు ట్రాన్స్ఫర్ వచ్చేసిందట. ఇంకో నెల రోజుల్లో రావొచ్చేమో! నేను ఒక వారం రోజులు సామాన్లవీ సర్ది, ట్రాన్స్పోర్ట్‌లో వేసి ఇద్దరినీ తీసుకొస్తాను. అమ్మ ఇంట్లో వుంటే కాస్త మనకీ సహాయంగా వుంటుంది కదా?"

భాను ఏమనలేదు, కానీ ఆమెకి యేదో తెలియని దిగుల్లాగనిపించింది. వాళ్ళు నలుగురే వుండడం అలవాటైంది. పని ఒత్తిడి ఎక్కువగానే వున్నా, హాయిగానే వుండేది. ఇప్పుడు ఇంట్లో ఇంకో ఇద్దరు సభ్యులు. అలవాట్లు మార్చుకోవడం కష్టమే. నలుగురే వుండడం అలవాటైన ఇంట్లో ఆరుగురు సర్దుకోవలి. అమ్మూని వేరే ఇల్లు అద్దెకి తీసుకొని వుండమంటే ఏమనుకుంటుందో! ఏదో బెంగగా అనిపించిందామెకి.

"అశోక్! ఇన్నేళ్ళ తరవాత అందరం కలిసి వుండగలుగుతామా? అత్తయ్యగారి ఆరోగ్యం ఎలా వుందో! ఒకవేళ సర్దుకోవడం కష్టమైతే ఏం చేద్దాం?"

"చూద్దాం! నువ్వెక్కువగా ఆలోచించకు. ఇవాళ కాకపోతే రేపైనా అమ్మ మన దగ్గరికొచ్చేయల్సిందే కదా. అమ్మూ మూడ్ ఎలా వుందో చూసి మళ్ళీ సంబంధాలు చూద్దామా?"

"సంబంధాలు చూడడం అంటే, పాపం ఏమంటుందో! ఏమిటో, అన్నీ సమస్యలే కనిపిస్తున్నాయి కదూ?"

"డోంట్ వరీ బేబీ! ఏ రోజుకారోజు మేనేజ్ చేద్దాం. నీ మూడ్ బాగవాలంటే, నేనింకో వార్త చెప్తాను!"

"రియల్లీ? ఏమిటది?" కుతూహలంగా అడిగింది భాను.

"మా డిపార్ట్‌మెంట్ ఫాకల్టీ అందరం కలిసి ఒక కొత్త వెబ్ పత్రిక నడపాలని నిశ్చయించుకున్నాము. మొదటి సంవత్సరం నేనే ఎడిటర్!"

"అవునా? గ్రేట్. అవును, ఇంతకీ వెబ్ పత్రిక అంటే?"

"నువ్వేం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వమ్మా తల్లీ? వెబ్ పత్రిక అంటే ఇంటర్‌నెట్ సాయంతో ఆన్‌లైన్ చదువుకునే పత్రిక. ప్రింటు పత్రికలా హార్డ్ కాపీ వుండదు. మొదటి ఇష్యూ దసరా పండక్కి తీసుకు రావాలని ప్లాను. మొదటి ఇష్యూకి ఫాకల్టీ సభ్యులూ, పీహెచ్డీ స్టూడెంట్లూ, ఎమ్మే స్టూడెంట్లూ వ్యాసాలు వ్రాస్తున్నారు. వ్యాసాలతోపాటు ఇంకేమేం ఫీచర్లు వుంటే బాగుండొచ్చు?"

"అడక్క అడక్క నన్నే అడుగుతున్నావా? నేనసలు న్యూస్ పేపరు కూడా సాంతంగా, శ్రద్ధగా చదవలేను."

"అలా అనకు భానూ! అసలేమీ చదవకుంటే నీ మనసులో వుండే ఆలోచనలు ఎలా వేలిడేట్ చేసుకుంటావు?"

"అంటే?"

"అంటే, మన మనసులో లక్షల ఆలోచనలు కలుగుతూ వుంటాయి అవి సరైనవో కాదో, మనకి ఎలా తెలుస్తుంది? పక్కన మనుషులతో పంచుకుంటాం, చర్చిస్తాం. అలాగే పుస్తకాలు చదివితే, మన ఆలోచనలు ఇతర్ల ఆలోచనలతో, అభిప్రాయాలతో పోల్చుకొని, మంచి చెడ్డలు బేరీజు వేసుకోవడానికి అవకాశం వుంటుంది. లేకపోతే, కేవలం మన తలలో పుట్టే ఆలోచనలూ, అభిప్రాయాలతోనే బ్రతుకంతా గడపాల్సొస్తుంది."

"నువ్విలా వివరించినప్పుడు ఏదైన పుస్తకం చదవాలనే వుంటుంది అశోక్. కానీ, ఏదైన పుస్తకం మొదలు పెట్టి నాలుగు పేజీలు చదివి అయిదో పేజీకి రాగానే, అంతకు ముందు చదివిన నాలుగు పేజీలూ మర్చి పోతాను," బిక్క మొహమో అన్న భానుని చూసి నవ్వాడు అశోక్.

"మరి కంప్యూటర్ లాంగ్వేజ్ కోర్సులు బానే చదువుకున్నావు కదా?"

"అవును, కానీ ఆ లాంగ్వేజీలన్నీ చదవడమే కాకుండా ప్రాక్టీసు చేస్తాం కదా, అందుకని గుర్తుంటాయి! ”

నవ్వాడు అశోక్.

"పద, గిన్నెలన్నీ సర్ది పడుకుందాం పద. ఇవాళ పిల్లల అల్లరితో మధ్యాహ్నం ఒక్క నిమిషం పడుకోలేదు, అలాగని చదువుకోనూ లేదు! నిద్రొస్తుంది."

## 2006– జులై

"అశోక్, ఇవాళ భార్గవ్‌ని స్కూల్ నుంచి ఇంటికి తీసుకురమ్మన్నాను. మరిచిపోయావు. కనీసం నాకు ఫోనైనా చేయలేదు. నీకసలు బుద్ధుందా? పిల్లడెవరిదైనా ఆటో యెక్కి వెళ్ళిపోతే? నీకసలు సీరియస్‌నెస్సుందా? టైమెంతయిందో తెలుసా? "

అలిసిపోయి రాత్రి యెనిమిదింటికి ఇల్లు చేరిన అశోక్ ఒక్కక్షణం బిత్తరపోయాడు.

"అది కాదు భానూ, ఇవాళ డిపార్ట్‌మెంటులో సాయంత్రం మీటింగుందని చెప్పాగా? ఆ మీటింగు కొంచెం ఆలస్యమైంది."

"చెప్పావు, అప్పుడు నేనూ చెప్పాను, ఇవాళ ఆటో అతను రాడు, నాకు మా ఆఫీసునించి ఇక్కడి దాకా మూడున్నరకల్లా రాలేను, నువ్వొచ్చి తీసుకు రమ్మని. సరిగ్గా వినకుండానే ఊ ఊ అన్నావు. ఎవరూ రాలేదని స్కూల్ వాచ్‌మాన్  ఫోన్ చేస్తే, ఆదరాబాదరా వొచ్చి చచ్చాను."

"అయాం సారీ భానూ! అమ్ముకైనా ఫోన్ చేయలేకపోయావా?"

"అవునవును, అమ్ముకి ఫోన్ చేస్తే, తనెళ్ళి బాబుని ఇంటికి తీసుకొస్తుంది!  ఆ తరవాత ఇంటికొచ్చేసరికి అత్తయ్యేమో వంట చేసి వుంచుతారు! నా బ్రతుకు బాగుపడిపోతుంది! ఒక్కసారి కళ్ళు తెరిచి చూడు అశోక్! ఒక్కదాన్నీ ఇంట్లో బయటా పని చేసుకోలేక చస్తున్నాను. నువ్వేమో మీ డిపార్ట్‌మెంటులో మీటింగులూ, మీ పత్రిక పనులూ, అంటూ ఇల్లు పట్టకుండా తిరిగితే నేనొక్కదాన్నే ఎంతకని సర్దుకోను? నువ్వే చెప్పు!  అమ్ము బేంకుకెళ్ళి రావడం తప్ప ఇవతల చెంచా తీసి అవతల పెట్టదు. పాపం, అత్తయ్యగారినేమీ అనడానికి లేదు. ఆవిడకి మోకాళ్ళ నొప్పులు. ఇదివరకట్లా సహాయం చేయలేకపోతున్నారు. చంటిదానికి అదృష్టవశాత్తూ మా ఆఫీసులోనే కేర్ సెంటర్‌లో చోటు దొరికింది. అయినా, ఇంటి పనీ, ఆఫీసు పనీ, పిల్లల పనీ, వీటన్నిటితో నేనెంత నలిగి పోతున్నానో నీకు కనిపిస్తుందా?" భాను కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అశోక్‌కి జాలేసింది.

భాను అంటున్నాది అక్షరాలా నిజం. తను తన వృత్తిలోనే కాకుండా రచయితగా, పత్రిక సంపాదకుడిగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలో ఇరవై నాలుగు గంటలు సరిపోవడం లేదు. అమూల్య హైదరాబాదు ట్రాన్స్ఫరవడంతో తల్లితో సహా వొచ్చి తమతోనే వుంటుంది. తనకంటూ సంసారమూ, ఇల్లూ, భర్తా లేడన్న నిరాశో యేమిటో కానీ, ఇంట్లో యేదీ పట్టించుకోదు. పైగా మనసు కుదుటపర్చుకోవడానికని సియే పరీక్షలకి

చదువుకుంటూంది. అమ్మకి మోకాళ్ళ నొప్పులు ఎక్కువై కదలడానిక్కూడా కష్టపడుతుంది. వెరసి ఇంతమందికి వండి వార్చి, ఇల్లూ వాకిలి చూసుకుంటూ భాను ఒక్కత్తే చాలా ఇబ్బంది పడుతూ వుంది. ఎలా, ఈ సమస్యకి పరిష్కారం చూడడం?

ఇవాళ మరీ ఆలస్యమయింది. భానుకి కోపం రావడం సహజమే. లోపలికెళ్ళి మొహం కడుక్కొని బట్టలు మార్చుకొని వచ్చాడు. హాల్లో అంతా మౌనంగా టీవీలో ఏదో సీరియల్ చూస్తున్నారు. భార్గవ్ తల్లి పక్కనే కూర్చొని హోమంవర్క్ చేసుకుంటున్నాడు. పాపాయి భాను ఒళ్ళో నిద్రపోతుంది.

"అందరూ అన్నాలు తినేసారా? నాకు బాగా ఆకలేస్తుంది," అశోక్ అన్నాడు ఎవర్నీ ఉద్దేశించకుండా.

"నాకాకలి లేదు. అత్తయ్యా, అశోక్ కి అన్నం పెట్టి, మీరూ అమ్మూ తినేయండి," భాను కళ్ళింకా తడిగానే వున్నాయి.

"భానూ, ఏంటిది చిన్న పిల్లలా? లే, అందరం కలిసి అన్నం తిందాం రా. అమ్మూ, నువ్వెళ్ళి కొంచెం కంచాలూ మంచి నీళ్ళు పెట్టు. పాపని మంచం మీద పడుకో బెట్టి రా భానూ!" సుమిత్ర అనునయంగా అనడంతో భాను లేచింది.

"అన్నట్టు, మీకందరికీ ఒక ఇంటెరెస్టింగ్ న్యూస్!" వున్నట్టుండి అశోక్ అన్నాడు.

"ఏంటన్నయ్యా?" అమూల్య అడిగింది. భాను ఇంకా మౌనంగానే భోజనం చేస్తూ వుంది.

"మా ఇన్స్‌టిట్యూట్ హోదా మారబోతుంది. ఇంకొద్ది నెలల్లో మేము సెంట్రల్ యూనివర్సిటీలాటి యూనివర్సిటీ హోదా పొందబోతునాం?"

"అంటే?"

"అంటే, ఇంతవరకూ మాది సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంగ్లీష్ ఎండ్ ఫారిన్ లాంగ్వేజెస్ కదా? ఇకపై దాన్ని ఇంగ్లీష్ ఎండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ అంటారన్నమాట. దానివల్ల మాకు గ్రాంటులూ, ఫాకల్టీ హోదా పెరుగుతాయి. కేవలం రీసెర్చి మత్రమే కాకుండా, ఎమ్మే లాటి డిగ్రీల్లోకి విద్యార్థులని కూడా తీసుకోవచ్చు. మొత్తం మీద ఇది వృత్తి పరంగా నాకు చాలా మంచి మార్పు. నాకు రీడరు గానో, అసిస్టెంటు ప్రొఫెసరు గానో ప్రమోషన్ వచ్చిందంటే ఇక మనకి తిరుగుండదు!" అశోక్ ఉత్సాహంగా అన్నాడు.

భాను నిరుత్సాహంగానే అయినా కొంచెం చిన్నగా నవ్వింది.

ఆ రాత్రి పడుకునే ముందు అన్నాడు అశోక్

"అయాం రియల్లీ సారీ భానూ. నీ శ్రమని మేమందరం చాలా గ్రాంటెడ్‌గా తీసుకుంటున్నాము. నేనేమో, కొంచెం ఐడెంటిటీకోసమూ, డాన్సు ప్రపంచంలో ఏ మాత్రమూ నాకు స్థానం లేదన్న నిరాశని నింపుకోవడం కోసమూ రచనా, జర్నలిజమూ దారి పట్టాను. తీరిక సమయమంతా దాంతోనే సరిపోతుంది. ఇంటి వ్యవహారాల్లో నీకసలు ఏ

మాత్రమూ సహాయం చేయకుండా అంతా నీ మీదే వొదిలేస్తున్నాను. ఇప్పణ్ణించీ పిల్లల బాధ్యత తీసుకుంటాను. వంట చేసి పెట్టే మనిషిని పెట్టుకుందాం. కావాలంటే పనమ్మాయికి జీతం పెంచి ఇంకొంచెం ఇంటి పని చేయించుకో." భాను మాట్లాడకుండా పడుకుంది.

★★★★★★★★★★★★★★★★★

2007– డిసెంబరు

"అపార్ట్‌మెంటు బాగుందే భానూ! మీ స్థలం తీసుకొని రెండే ఫ్లాటులిచ్చారా?" ప్రభావతి పాపాయికి పట్టు లంగా వేసి మెళ్ళో గొలుసు వేసి ముస్తాబు చేసి ఆడిస్తూ అడిగింది.

గృహ ప్రవేశం సామాను సర్దుతూ వుంది భాను.

"అవునమ్మా, ఒకటి మాకు తీసుకొని, రెండోది అమ్మూ కని తీసుకున్నాము. ఇప్పుడది అద్దెకిచ్చాము. రేపెప్పుడైనా పెళ్ళైతే, ఆ ఫ్లాట్‌లోకి వెళ్ళిపోతుంది."

"ఆ అమ్మాయికి మళ్ళీ సంబంధాలు చూస్తున్నారా?" ప్రభావతి గొంతు తగ్గించి అడిగింది.

"మరి ఎప్పటికీ ఒంటరిగా ఎలా వుండిపోతుందమ్మా? అందుకే ఈ మధ్యే మొదలు పెట్టాము. ఎవరైనా మంచి అబ్బాయి కనిపిస్తే పెళ్ళి చేయాలనే వుంది మాకు."

"అది సరే, భార్గవ్ గాడికి ఎనిమిదేళ్ళొచ్చాయి. ఆ ఇంటి పక్కన స్కూలు మానేసి ఇంకేదైనా పెద్ద స్కూల్లో వేయమన్నారు నాన్న. ఆలోచించావా?"

నవ్వింది భాను.

"ఎందుకమ్మా వేలకి వేలు పోసి ఆ ఫాన్సీ బళ్ళల్లో చదివించడం? మా కొలీగ్ సుజాత లేదూ? ఆమె కొడుకు అలాగే కట్టలకొద్దీ నోట్లు కట్టి పెద్ద స్కూల్లో చేర్పించింది. పిల్లాడూ, తల్లీ అలిసిపోవడం తప్ప చదువేమీ పెద్దగా రావడం లేదు. అయినా ఇప్పుడు అశోక్ వాళ్ళ ఇన్స్టిట్యూట్ సెంట్రల్ యూనివర్సిటీ అయిందిగా? హాయిగా పిల్లలిద్దరికీ సెంట్రల్ స్కూల్లో సీటిస్తారు. ఇంటర్‌మీడియేట్ వరకూ దిగుల్లేదు."

"సెంట్రల్ స్కూల్లో తెలుగు చెప్పరే భానూ! అంతా హిందీ మయం."

"అబ్బ, తెలుగు ఇంట్లో చెప్తా లేమ్మా. నువ్వు నేర్పించు పోనీ! ఎండాకాలం సెలవుల్లో నీ దగ్గరకే పంపుతా ఇద్దరినీ, సరేనా?"

"భార్గవని పంపు. ఈ చంటిదాని వెనక పరుగులు పెట్టడం నా వల్ల కాదు. దీనిదంతా మీ నానమ్మ పోలిక! నన్ను సాధించడానికి మళ్ళీ నీ కడుపున పుట్టింది మహా తల్లి." నవ్వింది భాను.

★★★★★★★★★★★★★★★★★

"అశోక్, మీ డిపార్ట్‌మెంటు కొలీగ్స్ భలే సరదాగా వున్నారు. అంతంత పెద్ద ప్రొఫెసర్లు, చాలా సింపుల్‌గా, అందరితో కలిసిపోయారు. మీ లిటరేచర్ వాళ్ళూ, మా ఇంజినీరింగ్ వాళ్ళు, భలే కాంబినేషన్! మన ప్రమేయం లేకుండా, కేటరింగ్ వాళ్ళ నుంచి భోజనాలు అందుకోవడం, వడ్డనలూ, సామాన్లు సర్దించడం అంతా వాళ్ళే చూసుకున్నారు. నేనసలు ఇంతమంది ఒక దగ్గరే చేరి తెలంగాణా, ఆంధ్రా అంటూ తలలు పగలగొట్టుకుంటారేమో అని భయపడ్డాను."

"అమ్మూ వాళ్ళ బాంక్ స్టాఫ్‌ని వొదిలేసావే? వాళ్ళు గంభీరంగా ఒక పక్కన కూర్చొని అందరినీ గమనిస్తూ వుండిపోయారు!"

"అమ్మూ, అంటే గుర్తొచ్చింది. మీ కొలీగ్ రామకృష్ణని చూసావా?"

"రోజూ చూస్తూనే వుంటా. జర్మన్ డిపార్ట్‌మెంటులో ట్రాన్స్‌లేషన్ పని చూస్తూ వుంటాడు."

"రోజూ సంగతి కాదు! ఇవాళ్టి సంగతి. అతన్ని మన అమ్మూకి ఇంట్రొడ్యూస్ చేస్తే ఎలా వుంటుంది? ఇద్దరికీ ఒకరికొకరు నచ్చితే, మనం మాట్లాడొచ్చు."

అశోక్ మొహం సీరియస్‌గా అయిపోయింది.

"నాట్ ఎ బేడ్ అయిడియా భానూ! నేను అతన్ని కదిలించి చూస్తా, నువ్వు అమ్మూని అడుగు. ఇద్దరూ సుముఖంగా వుంటే వచ్చే శనివారం నలుగురం బయట కాఫీకెళ్ళొచ్చు!"

"అలాగే, రేపు అడుగుతాను.

"ఈ యేడాది మన పెళ్ళి రోజు కూడా ఏ హడావిడీ లేకుండా పనులతో బిజీగా అయిపోయింది. పోనీలే, ఈ గృహ ప్రవేశం మంచి పార్టీలా జరిగింది. మన పెళ్ళయి పదకొండేళ్ళు, మనకి యేనిమిదేళ్ళ కొడుకూ, నాలుగేళ్ళ కూతురూ! వామ్మో, ఇంత పెద్దయిపోయామా?"

"కదా? మనకే బుద్ధి సరిగా, పూర్తిగా రానేలేదు, అంతలోకే మనకిద్దరు పిల్లలు!"

"భార్గవ గాడి చదువు అసలు నువ్వు చూడనే చూడడంలేదు. స్కూల్లో కాస్త బాగానే చెప్తున్నారు, చిన్న స్కూలయినా. నేను జనవరి నుంచి వాడి పుస్తకాల మీద ఇంకొంచెం ధ్యాస పెడతాను."

"జులైలో ఇద్దరినీ కేవీలో చేర్పించామంటే, స్కూలు ఫీజుల గొడవ వొదిలిపోతుంది."

"అన్నట్టు, అశోక్, కోమలి ఇండియా తిరిగొచ్చేస్తుందట. ఆశా చెప్పిందివాళ."

"తిరిగొచ్చేసిందా? అంటే, పర్మనెంటుగానా?"

"అవును! ఆగస్టులో గోకుల్ చాట్ బ్లాస్టులో వాళ్ళ నాన్నగారికి బాగా దెబ్బలు తగిలాయి. కాలికి ఆపరేషన్ చేసి తీసేయాల్సొచ్చింది. మనిద్దరం వెళ్ళి చూసొచ్చాం కూడా! గుర్తుందా?"

"గుర్తుంది, అప్పుడు కోమలి కూడా వొచ్చి నెల రోజులు లేదూ?"

"అవును. సెప్టెంబరులో వెళ్ళింది, కానీ, వుండలేకపోతుందట. ఉద్యోగానికి రాజీనామాచేసి, హైదరాబాదు తిరిగొచ్చేయాలని అనుకుంటుందట."

"గోకుల్ చాట్ బ్లాస్టూ, లుంబినీ పార్కు బ్లాస్టూ చాలా మంది బ్రతుకులని తల కిందులు చేసాయి, పాపం."

★★★★★★★★★★★★★★★★★

2008– జులై

"నానమ్మా! మా కొత్త స్కూలు ఎంత పెద్దదో తెలుసా? మా క్లాసులో ఫార్టీ స్టూడెంట్స్! చాలా మంది స్టూడెంట్స్ నాన్నంత పొడుగ్గా వున్నారు! చెల్లి వాళ్ల క్లాసులో మాత్రం అంతా పొట్టిగా వున్నారు," స్కూల్ నుంచొచ్చి నానమ్మ పెట్టిన కారప్పూస తింటూ, భార్గవ కబుర్లు చెప్తూ వున్నాడు.

"అమ్మేది?" మొదటిసారి స్కూలు కెళ్ళిన అనఘ గంట నించీ ఆ ఒక్క ప్రశ్నే అడుగుతుంది.

"వొచ్చేస్తుందమ్మా! ముందు నువ్వు కాసిని పాలు తాగు." సుమిత్ర బుజ్జగించింది.

"కొత్త స్కూలు బాలేదు నానమ్మా!అమ్మకి ఫోన్ చేస్తాను," అనఘ లేచి వెళ్ళబోయింది.

అశోక్ తలుపు తీసుకొని వచ్చాడు.

"వొచ్చావా అశోక్! హమ్మయ్య, ఇక నీ కొడుకు కబుర్లు నువ్వే విను. నేను కొంచెం సేపు పడుకుంటాను," అలిసిపోయిన సుమిత్ర లేచి వెళ్ళిపోయింది.

"నాన్నా, నువ్వు డాక్టర్వే కదా, మరి చెల్లికి జ్వరం వొస్తే మందులెందుకివ్వవ్?" బొమ్మల పుస్తకంలోంచి తలెత్తి అడిగాడు భార్గవ్.

"ఎందుకంటే నేను మెడికల్ డాక్టర్ని కాదు."

"మెడికల్ డాక్టరంటే?"

"మందులిచ్చే డాక్టర్"

"మరి నువ్వేం డాక్టర్?"

"చదువు చెప్పే డాక్టర్."

"ఏం చదువు చెప్తావ్?"

"ఇంగ్లీషు?"

"ఇంగ్లీషందరికీ వొచ్చుగా? నువ్వు మేత్స్ చెప్పు! ఎవరికీ రాదు!"

"నాన్నా, అమ్మేది?"

"వొస్తుందిలే, నువ్వూరికే బాదర్ చేయకు. నీకు హోంవర్క్ లేదా?" భార్గవ్ పెద్దరికంగా అడిగాడు. వాణ్ణేమీ పట్టించుకోలేదది.

"నాన్నా, డాన్సు చేద్దాం!"

దాన్ని ఒళ్ళోకెక్కించుకున్నాడు అశోక్. దాని బుజ్జి చేతులని తన చేతుల్లోకి తీసుకొని, "తా తై, తిత్తి తై" ఆడించాడు.

"మరీ, అనఘా, నువ్వు నాన్న దగ్గర డాన్సు నేర్చుకుంటావా?"

"నేను, నేను, నాకు నేర్పు నాన్నా!" భార్గవ్ తండ్రి పక్కన చేరాడు. వాళ్ళిద్దర్నీ ముద్దు చేసాడు అశోక్.

"అబ్బో, ముద్దులన్నీ మీ నాన్నకేనా, అమ్మకిచ్చేదేమైనా వుందా?" లోపలికొచ్చి భాను, బాగ్ పక్కన పడేసి, సోఫాలో కూలబడుతూ అంది.

"అరే, నువ్వెప్పుడొచ్చావ్? తలుపు చప్పుడన్నా అవలేదు! అయినా, ఇవాళ ఇంత తొందరగా?"

"ఇవాళ పనమ్మాయి సాయంత్రం రానంది. అత్తయ్య ఒక్కర్తే పిల్లలతో అవస్థ పడతారని కొంచెం ముందుగా వొచ్చేసాను. మరి, నువ్వేమిటీ టైంలో?"

"మా ప్రొఫెసర్ ఒకాయనని ఎయిర్‌పోర్టులో దించటానికెళ్ళాను. ఇక అక్కణ్ణించి ఇంటికొచ్చేసాను."

"అమ్మొచ్చేసింది నానమ్మా!" అనఘ లోపలికి పరిగెత్తింది చెప్పటానికి.

"అందరం ఇంట్లో, ఇంత తొందరగా! రేపు శనివారం పైగా! ఏం చేద్దాం? సినిమాకెళ్దామా?"

"అబ్బ, సినిమాకొద్దు అశోక్. మా ఇంటికెళ్దామా? అక్కడే భోజనం కూడా చేయొచ్చు."

"మనందరం వెళ్తే మళ్ళీ అత్తయ్యగారికి వంట ప్రయాస. వెళ్తూ వెళ్తూ ఏదైనా రెస్టారెంటులో అందరికీ డిన్నర్ పట్టికెళ్దాం."

"అమ్మా! భార్గవ్ నీ ఫోన్ తీసుకొని ఆడుతున్నాడు."

"భార్గవ్ అనొద్దు, అన్నయ్య అనాలని నీకెన్నిసార్లు చెప్పాను?"

"మరి వాడు నన్ను అనఘా, అంటాడు కదా? వాణ్ణి నన్ను అన్నయ్య అని పిలవమని చెప్పు!"

భార్గవ్ పగలబడి నవ్వాడు.

"యూ సిల్లీ గర్ల్! ఓన్లీ బాయ్స్ అన్నయ్యలవుతారు. గర్ల్స్ కాదు!"

"అమ్మా, వాడు నవ్వుతున్నాడు. వాణ్ణి కొట్టు!"

భాను ఫోన్ మోగింది. నవ్వుతూ ఫోన్ తీసింది భాను.

"హలో, నాన్నా! ఇప్పుడే మేమంతా అక్కడికొద్దామని ప్లాన్ వేస్తున్నాం. వొచ్చేటప్పుడు.." భాను మాటలాపేసింది సడన్‌గా.

★★★★★★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS